వరంగల్ తూర్పులో బీఆర్ఎస్ ఖాళీ

మంత్రి కొండా సురేఖ

4 లో

నేడు ఎమ్మెల్సీ నోటిఫికేషన్

3 లో

www.aksharadarbar.com

బుధవారం 01, మే 2024

అక్షర దర్బార్

voice of the people

తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :75 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

కార్పొరేట్ సెక్టార్ల కోసమే

రిజర్వేషన్ల రద్దు

- ప్రశ్నించినందుకే ఢిల్లీలో కేసులు
- బీజేపీ స్పష్టమైన విధానాన్ని వెల్లడించాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

04

కాంగ్రెస్ లో కొత్త లొల్లి

- చేరికలను కొన్ని చోట్ల వ్యతిరేకిస్తున్న పాత కేడర్
- పలు సందర్భాల్లో గొడవకు దిగుతున్న పాత, కొత్త కేడర్
- తల పట్టుకుంటున్న పార్టీ స్థానిక నాయకత్వం
- ఇప్పటికీ కడియం చేరికపై తొలగిపోని అసంతృప్తి
- నిరసన గళంతో పార్టీలో సర్దుకోని పరిస్థితి
- హస్తం పార్టీ విజయ అవకాశాలపై ప్రభావం పడే ఛాన్స్

02

పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో ఇతర పార్టీల నుంచి చేరికలకు స్వాగతం

కాంగ్రెస్ పార్టీలో 'కొత్త' పంచాయితీ కలవరం రేపుతుంది. పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ గడువు సమీపిస్తున్న తరుణంలో ఈ పంచాయితీ రోజురోజుకూ ముదురుతుండటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇతర పార్టీల నుంచి తమ పార్టీలో కొత్తగా చేరిన నేతలు, కార్యకర్తలకే ప్రాధాన్యత లభిస్తుందని, తమకు గుర్తింపు కరువైందని సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న కేడర్ నిరసన గళం వినిపిస్తోంది. ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ అధికారంలోకి రావాలని జెండాను భుజాన మోసిన తమకు పార్టీ అధికారంలోకి రాగానే ఆదరణ కొరవడిందని కుమిలిపోతున్నారు. ప్రధానంగా తమ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తమపై పెత్తనం చేసిన వారే మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి తమపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని వాపోతున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త కేడర్ మధ్య గ్యాప్ పెరుగుతూ వస్తోంది. పలు సందర్భాల్లో పాత, కొత్త కేడర్ గొడవకు దిగుతోంది. ప్రధానంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. ఈ వాతావరణం ఆయా శాసనసభ నియోజకవర్గం పరిధిలో స్థానిక నాయకత్వానికి సమస్యగా మారుతున్నది. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలను ఆహ్వానిస్తే పాత, కొత్త కేడర్ కు నచ్చ చెప్పలేక ముఖ్య నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే స్టేషన్ గణపురం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కడియం కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరిక, కావ్యకు కాంగ్రెస్ టికెట్ కేటాయింపుపై హస్తం పార్టీ కేడర్ లో చోటుచేసుకున్న అసంతృప్తి ఇప్పటికీ తొలగిపోలేదు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిపోయినా పరిస్థితి ఇంకా సర్దుకోలేదు. ఈ నేపథ్యంలో తలెత్తిన పాత, కొత్త కేడర్ పంచాయితీ ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

\- అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

మళ్లీ కాంగ్రెస్ గెలిస్తే ఆగమే

- మానుకోట జిల్లా ఉండాలంటే కవిత గెలవాలి
- రోడ్ షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

మహబూబాబాద్ జిల్లా ఉండాలంటే మాలోత్ కవిత గెలవాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు అన్నారు. పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని ఆయన చేపట్టిన బస్సు యాత్ర బుధవారం సాయంత్రం మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మహబూబాబాద్ లో జరిగిన రోడ్ షోలో కేసీఆర్ ప్రసంగించారు. మహబూబాబాద్ జిల్లా తీసేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడు. మహబూబాబాద్ జిల్లా ఉండాల వద్దా. మహబూబాబాద్ జిల్లా ఉండాలంటే ఇక్కడి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఎంపీ మాలోత్ కవితను గెలిపించాలని కేసీఆర్ ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి. వెన్నవరం కెనాల్ వచ్చేదాకా ఇక్కడికి నీళ్లు రాలేదు. కాళేశ్వరం కట్టిన తర్వాతే ఈ ప్రాంతానికి నీళ్లు వచ్చాయి. ఈ ఏడాది నీళ్లు రాలేదు. ఎందుకు నీళ్లు ఎందుకు రాలేదో ప్రజలు ఆలోచించాలని అన్నారు.

_ అక్షర దర్బార్, మహబూబాబాద్

కాంగ్రెస్ లో 'కొత్త' లొల్లి..

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

- పార్టీ అధిష్టానం ఆదేశాలతో ఇతర పార్టీల నుంచి చేరికలకు స్వాగతం
- చేరికలను కొన్ని చోట్ల వ్యతిరేకిస్తున్న పాత కేడర్
- పలు సందర్భాల్లో గొడవకు దిగుతున్న పాత, కొత్త కేడర్
- తల పట్టుకుంటున్న పార్టీ స్థానిక నాయకత్వం
- ఇప్పటికీ కడియం చేరికపై తొలగిపోని అసంతృప్తి
- నిరసన గళంతో పార్టీలో సర్దుకోని పరిస్థితి
- హస్తం పార్టీ విజయ అవకాశాలపై ప్రభావం పడే ఛాన్స్

కాంగ్రెస్ పార్టీలో 'కొత్త' పంచాయతీ కలవరం రేపుతుంది. పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ గడువు సమీపిస్తున్న తరుణంలో ఈ పంచాయతీ రోజురోజుకి ముదురుతుండటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇతర పార్టీల నుంచి తమ పార్టీలో కొత్తగా చేరిన నేతలు, కార్యకర్తలకే ప్రాధాన్యత లభిస్తుందని, తమకు గుర్తింపు కరువైందని సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న కేడర్ నిరసన గళం వినిపిస్తుంది. కష్టాలు ఎన్ని ఎదురైనా పార్టీ అధికారంలోకి రావాలని జెండాను భుజాన మోసిన తమకు పార్టీ అధికారంలోకి రాగానే ఆదరణ కొరవడిందని కుమిలి పోతున్నారు. ప్రధానంగా తమ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తమపై పెత్తనం చేసిన వారే మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి తమపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని వాపోతున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త కేడర్ మధ్య గ్యాప్ పెరుగుతుంది. పలు సందర్భాల్లో పాత, కొత్త కేడర్ గొడవకు దిగుతుంది. ముఖ్యంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇది ఎక్కువగా కనబడుతుంది. ఈ వాతావరణం ఆయా శాసనసభ నియోజకవర్గం పరిధిలో స్థానిక నాయకత్వానికి సమస్యగా మారుతుంది. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలను ఆహ్వానిస్తే పాత, కొత్త కేడర్ కు నచ్చ చెప్పలేక ముఖ్య నేతలు తల పట్టుకుంటున్నారు. ఇప్పటికే స్టేషన్ గణపురం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కడియం కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరిక, కావ్యకు కాంగ్రెస్ టికెట్ కేటాయింపుపై హస్తం పార్టీ కేడర్ లో చోటుచేసుకున్న అసంతృప్తి ఇప్పటికీ తొలగిపోలేదు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిపోయినా పరిస్థితి ఇంకా సర్దుకోలేదు. ఈ నేపథ్యంలో తలెత్తిన పాత, కొత్త కేడర్ పంచాయతీ ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సద్దుమనగని అసంతృప్తి

స్టేషన్ గణపురం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరటం, కావ్యకు వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి తమ పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించడం పట్ల ఈ స్థానం పరిధిలోని కాంగ్రెస్ కేడర్ లో అసంతృప్తి గూడు కట్టుకుంది. మరో కొద్ది రోజుల్లో పోలింగ్ జరగనునుండగా ఇప్పటికీ కాంగ్రెస్ పాత కేడర్ లో అసంతృప్తి సద్దుమనగలేదు. ఇంకా సర్దుకోలేదని స్పష్టంగా కనబడుతుంది. కడియం శ్రీహరి తెలుగుదేశం, బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మంత్రి, డిప్యూటీ సీఎంగా పనిచేసిన కడియం శ్రీహరి వల్ల తాము తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని, ఈ క్రమంలో ఆయన్ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం, కడియం కూతురు కావ్యను వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దింపటాన్ని కాంగ్రెస్ కేడర్ నిరసిస్తుంది. ఈ నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లో చేరిన నేతలు, కార్యకర్తలకు ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న కేడర్ కు మధ్య గ్యాప్ ఏర్పడుతుంది. ఇతర పార్టీల నుంచి ను కాంగ్రెస్ లో చేరిన నేతలు, కార్యకర్తలు ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని ఎక్కువగా హడావుడి చేస్తూ తమ పార్టీ ముఖ్య నేతలతో కలిసి ప్రతి చోట వేదికను పంచుకుంటుండటాన్ని పాత కేడర్ ప్రశ్నిస్తుంది. కొత్త కేడర్ కే పార్టీలో ప్రాధాన్యత దక్కుతుందని, తాము నిర్లక్ష్యానికి గురవుతున్నామని ఆవేదన చెందుతుంది. కాంగ్రెస్ పార్టీలో ఇటీవలి కాలంగా చేరిన నేతలు, కార్యకర్తల్లో ఎక్కువగా బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారే ఉన్నారు. వీరితో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో తాము పోరాడామని, తమను వేధింపులకు గురిచేసిన బీఆర్ఎస్ లోని నేతలు, కార్యకర్తలు ఇప్పుడు కాంగ్రెస్ లో చేరి తమ నాయకత్వానికి చేరువ కావడం ద్వారా తమపై డామినేషన్ చేస్తున్నారని హస్తం పార్టీ పాత కేడర్ భావిస్తుంది. దీంతో రోజురోజుకి పాత, కొత్త కేడర్ మధ్య అంతరం పెరిగిపోతుంది. ఫలితంగా వివిధ సందర్భాల్లో పాత, కొత్త కేడర్ మధ్య ఘర్షణ వాతావరణం ఆవిష్కృతం అవుతుంది.

భగ్గుమంటున్న అంతర్గత గొడవలు

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త కేడర్ మధ్య గొడవ మొదలైంది. స్టేషన్ గణపురం నియోజకవర్గం పరిధిలోని లింగాల గణపురం మండలంలో ఇతర పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరిక సందర్భంగా పాత, కొత్త కేడర్ మధ్య లొల్లి జరిగింది. బీఆర్ఎస్ నుంచి నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరటాన్ని హస్తం పార్టీలోని పాత కేడర్ వ్యతిరేకించింది. తమపై పెత్తనం చేసిన బిఆర్ఎస్ లోని కొందరు నేతలను కాంగ్రెస్ లో చేర్చుకోవటం పట్ల నిరసన వ్యక్తం చేసింది. కార్యక్రమం రసాభాసగా మారడంతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావ్య సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత వివిధ సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీలోని పాత, కొత్త కేడర్ మధ్య గొడవలు జరిగాయి. కాంగ్రెస్ లోని పాత క్యాడర్ వ్యతిరేకిస్తున్నా పార్టీ అధిష్టానం ఆదేశాల ప్రకారం స్థానిక నాయకత్వం ఇతర పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలను తమ పార్టీలోకి స్వాగ స్వాగతించాల్సిన పరిస్థితి. ఇంకా కాంగ్రెస్ పార్టీలో చేరికల పర్వం కొనసాగుతుంది. తాజాగా వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ పాత కేడర్ లో నెలకొన్న అసంతృప్తి భగ్గుమంది. వరంగల్ ఓసిటిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పాత, కొత్త కేడర్ మధ్య తలెత్తిన గొడవ ఘర్షణకు దారి తీసింది. ఇరు వర్గాలు వాగ్వాదానికి దిగడంతో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత రాష్ట్ర అటవీ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాత, కొత్త లీడర్ కు నచ్చజెప్పారు. ఇదే రోజు వర్ధన్నపేట మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో కూడా హస్తం పార్టీలోని పాత, కొత్త కేడర్ మధ్య లొల్లి జరిగింది. ఇటీవల పార్టీలో కొత్తగా చేరిన వారికే ప్రాధాన్యత లభిస్తుందని పాత కేడర్ కొందరు గొడవకు దిగారు. ఆ సమయంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి కడియం శ్రీహరి, కాంగ్రెస్ అభ్యర్థిని కావ్య సమావేశంలోనే ఉన్నారు. వివిధ నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఎన్నికల ముంగిట పార్టీ నాయకత్వంలో టెన్షన్ చోటుచేసుకుంటుంది.

రంగుల మార్చే ఊసరవెల్లి కడియం

బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్
వర్ధన్నపేట నియోజకవర్గంలో ప్రచారం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : రంగుల మార్చే ఊసరవెల్లి కడియం శ్రీహరి అని వరంగల్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ఆరోపించారు. బుధవారం పర్వతగిరి, ఏనుగల్లు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో అరూరి రమేష్ పాల్గొని మాట్లాడారు. కార్మిక సోదరులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా నన్ను రెండు సార్లు ఆశీర్వదించారని గుర్తుచేశారు. పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలని మీ ఆశీర్వాదం కోసం వచ్చానని తెలిపారు. గత ఆసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓడిపోవడం కోసం కడియం శ్రీహరి అనేక ప్రయత్నాలు చేశాడని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేసే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ దళితులు లేరా? కడియం కావ్యకు ఎందుకు టికెట్ కేటాయించారని ప్రశ్నించారు. వర్ధన్నపేట ఆసుపత్రిలో కడియం కావ్య పని చేసిందని, ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన దళితులను హీనంగా చూసిందని ఆరోపించారు. ఊసరవెల్లి లాగా రంగులు మార్చే వ్యక్తి కడియం శ్రీహరి అని ధ్వజమెత్తారు. కాగా, అరూరి గెలుపు వరంగల్ పార్లమెంట్ అభివృద్ధికి మలుపు అంటూ యువత చేసిన నినాదాలు హోరెత్తించాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రాజేశ్వర్ రావు, కొండేటి శ్రీధర్, వరంగల్ తూర్పు బీజేపీ ఇన్చార్జ్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తిరుపతి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కూడికాల శ్రీధర్, జిల్లా నాయకులు గాడిపల్లి రాజేశ్వర్ రావు, బన్న ప్రభాకర్, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్, నాయకులు ఏకాంతం, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న అరూరి రమేష్

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : గ్రేటర్ వరంగల్ 28వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ గందె కల్పన బుధవారం బీజేపీలో చేరారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో హైదరాబాదులోని పార్టీ కార్యాలయంలో కల్పన తన భర్త నవీన్ తో కలిసి కాషాయ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో వరంగల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, బీజేపీ నేతలు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే
- మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాల సందర్శన

మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే, హాజరైన ప్రజలు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. బుధవారం ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర సరిహద్దు మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన పలిమెల మండలంలోని సర్వాయిపేట, దమ్మూరు, మూకునూరు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించారు. ఈ నెల 13న జరగనున్న లోక్ సభ ఎన్నికల కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అంతకుముందు పలిమెల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలతో సమావేశమయ్యారు. మావోయిస్టులకు ఆశ్రయం ఇవ్వొద్దని, వన్య ప్రాణుల కోసం కరెంటు తీగలను అమర్చుతున్నారని, ఇది నేరమని హెచ్చరించారు. గుడుంబా తయారీదారులు మానుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం వాలీబాల్ టోర్నమెంట్ లో విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు ప్రతి గ్రామానికి వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. మావో ప్రభావిత ప్రాంతాల యువత పోటీ పరీక్షల్లో రాణించేందుకు, పుస్తకాలతో పాటు శిక్షణ ఇప్పించనున్నట్లు ఎస్పీ తెలిపారు. మావోయిస్టులు లొంగిపోతే వారికి ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాటారం డీఎస్పీ జి.రామ్మోహన్ రెడ్డి, మహదేవపూర్ సీఐ రాజేశ్వరరావు, పలిమెల ఎస్సై తమాషా రెడ్డి, కాళేశ్వరం ఎస్సై భవాని సేన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే దొంతి పరామర్శ..

అక్షర దర్బార్, నెక్కొండ: వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను బుధవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన కద్దూరి కొమరమ్మ, బంజర పల్లికి చెందిన జనగం శంకరయ్య, గొల్లపల్లికి చెందిన నాగపురి రవి కిరణ్ ఇటీవల మృతిచెందగా వారి చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ సభ్యుడు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, కాంగ్రెస్ నెక్కొండ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, సీనియర్ నాయకులు కుసుమ చెన్నకేశవులు, రావుల మహిపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు బోడ శ్రీకాంత్ నాయక్, గొల్లపల్లి గ్రామ అధ్యక్షుడు మాదారపు మహేందర్, నాయకులు అప్పం శ్రీను, దాసరి దేవేందర్, నరసింహారెడ్డి, బట్టు రాజు, కుమారస్వామి, అమరేష్ తదితరులు ఉన్నారు

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

- పోలీసులే కారణమని సూసైడ్ నోట్



అక్షర దర్బార్, హనుమకొండ : భర్త అదృశ్యం కావడంపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ, ఎస్సై వేధింపుల కారణంగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ ఉండటంతో బాధిత కుటుంబసభ్యలు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అదృశ్యమైన ప్రశాంత్ భార్య శ్యామల తెలిపిన వివరాల ప్రకారం.. వంగపహాడ్ కు చెందిన ప్రశాంత్ కు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డబ్బులు ఇవ్వాలి. సదరు వ్యక్తి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండటంతో ప్రశాంత్ హసన్ పర్తి పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఫిర్యాదు తీసుకోవాల్సిన పోలీసులు తిరిగి ప్రశాంత్ పైనే వేధింపులకు పాల్పడి, విచక్షణారహితంగా కొట్టారని ఆమె ఆరోపించింది. పోలీసుల దెబ్బలకు తాళలేక తన భర్త సూసైడ్ నోట్ రాసి అదృశ్యమయ్యాడని ఆమె వాపోయింది. తన చావుకు హసన్ పర్తి సీఐ, ఎస్సై కారణమని సూసైడ్ నోట్ లో పేర్కొన్నారని ఆమె రోదించింది. తన భర్తను కాపాడి, హసన్ పర్తి పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీపీకి ఫిర్యాదు చేసినట్లు శ్యామల తెలిపారు. సీపీ ఆదేశాలతో ప్రశాంత్ అదృశ్యం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా, దీనిపై శ్యామల రోదించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

పోలింగ్ శాతం పెంచాలి

- పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రచిత్ రాజ్

అక్షర దర్బార్, దుగ్గొండి : పోలింగ్ శాతం పెంచడానికి కృషి చేయాలని పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు రచిత్ రాజ్ తెలిపారు. బుధవారం దుగ్గొండి మండలంలోని నాచినపల్లి, రేకంపల్లి గ్రామాల్లో ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రచిత్ రాజ్, ఎన్నికల వ్యయ పరిశీలకులు ఉమాకాంత్ ద్రుపతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. కాగా, అధికారులకు నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, దుగ్గొండి రూరల్ సీఐ రాజగోపాల్, పరమేశ్వర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ రవిచంద్రా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేఖంపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

గాయత్రిని సన్మానిస్తున్న నాగుర్ల వెంకటేశ్వర్లు

పదో తరగతి టాపర్ ను సన్మానించిన నాగుర్ల

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండలానికి చెందిన ఆరెకుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు డాక్టర్ లోకటి నగేష్ కుమార్తె లోకటి గాయత్రి పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించగా, ఆమెను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు అభినందించి సన్మానించారు. ఆయనవెంట ఆరె కుల సంక్షేమ సంఘం విద్యావంతుల వేదిక అధ్యక్షుడు మోటే చిరంజీవి, తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, హింగే భాస్కర్, వాంకే రాజు తదితరులు ఉన్నారు.

డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ కు మాతృ వియోగం

అక్షర దర్బార్, పరకాల : ప్రముఖ వైద్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ తల్లి యాదలక్ష్మి (85) బుధవారం మృతి చెందారు. కాగా, ఆమె పార్థివ దేహానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, పరకాల పట్టణ ప్రముఖులు, ప్రజలు నివాళులర్పించారు.

కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై 48 గంటల నిషేధం

అక్షర దర్బార్, హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల అధికారులు బిగ్ షాక్ ఇచ్చారు. బుధవారం రాత్రి 8 గంటల నుంచి 48 గంటల పాటు బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ ప్రచారం చేయకుండా ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 5న సిరిసిల్ల సభలో ఆయన కాంగ్రెస్ పై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై ఈసీ చర్యలు చేపట్టింది. కేసీఆర్ ఎలాంటి సభలు, ర్యాలీలు, ఇంటర్వ్యూల్లో పాల్గొనవద్దని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఎన్నికల వేళ 48గంటల పాటు ప్రచారం చేయలేని పరిస్థితి రావడం పార్టీకి తీరని నష్టమని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

బడా బెల్టుషాపుపై పోలీసుల దాడి

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : వరంగర్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో కొన్నేండ్లుగా అతిపెద్ద బెల్లు షాపు నడుస్తోంది. ఈ సంగతి సంబంధిత అధికారులకు తెలియంది కాదు. దీనిపై స్థానికులు ఎప్పటి నుంచో అధికారులకు ఫిర్యాదు ఉన్నా సదరు బెల్టు షాపుపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తాజాగా టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆ బెల్టుషాపుపై దాడి చేశారు. తనిఖీల్లో మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

నేడు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. ఎన్నికల షెడ్యూల్ ను ఇప్పటికే ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ షెడ్యూల్ ప్రకారం మే 2న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందిన పల్లా రాజేశ్వర్ రెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 9 వరకు నామినేషన్ల స్వీకరణ, 10న పరిశీలన, 13లోగా నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఈనెల 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగనుంది. జూన్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

కార్పొరేట్ సెక్టార్ల కోసమే
రిజర్వేషన్ల రద్దు

- రిజర్వేషన్లపై ప్రశ్నించినందుకే ఢిల్లీలో కేసులు
- బీజేపీ స్పష్టమైన విధానాన్ని వెల్లడించాలి
- సీఎం రేవంత్ రెడ్డి

అక్షర దర్బార్, హైదరాబాద్ : రిజర్వేషన్లపై ప్రశ్నించినందుకే తనపై అక్రమ కేసులు పెట్టారని, 400 ఎంపీ సీట్లు గెలిచి, దేశాన్ని అమ్మేయాలని బీజేపీ భావిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముక్త్భారత్ అంటే రిజర్వేషన్లను రద్దు చేయడమేనా? అని ప్రశ్నించారు. జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, కూకట్ పల్లి, శేరిలింగంపల్లిలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రచార రోడ్డు షోలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. రిజర్వేషన్ల ఎత్తివేతతో బలహీన వర్గాలకు దక్కాల్సిన అవకాశాలు, నిధులు రావని ఆయన తెలిపారు. రిజర్వేషన్లపై గొంతెత్తి ప్రశ్నించినందుకు తనపై పగబట్టి స్వయంగా కేంద్ర హోంశాఖ మంత్రే కేసు పెట్టారని ఆరోపించారు. పదేళ్ల మోడీ పాలనలో తెలంగాణకు కేంద్రం ఇచ్చింది 'పెద్ద గాడిద గుడ్డు' అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, బీజేపీలపై సీఎం తీవ్రంగా విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని విమర్శించారు.

కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన తెలిపారు. సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ కార్మిక సంఘాలు సకలజనుల సమ్మె చేశారని గుర్తు చేశారు. రిజర్వేషన్ల రద్దుపై తాను ప్రశ్నించినందుకు బీజేపీ నేతలు ఈడీ, ఐటీ, సీబీఐతోనే కాకుండా ఢిల్లీ పోలీసులతో భయపెట్టాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజ్యాంగ సవరణకు కుట్ర..

రాజ్యాంగంలోని మూలాలను సవరించేందుకు బీజేపీ కుట్ర కు తెరలేపి 400 సీట్లు అడుగుతోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరిని మోడీ, అమిత్ షా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ అజెండాను, మూల సిద్ధాంతాలను కాషాయ పార్టీ అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఢిల్లీ సుల్తాన్లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగ సవరణలకు పార్లమెంటులో 2/3 మెజార్టీ, 50శాతం రాష్ట్రాల ఆమోదం తప్పనిసరి, అందులో భాగంగానే రాష్ట్రాలపై బీజేపీ కన్నేసి చిచ్చు రేపుతోందని ధ్వజమెత్తారు. దళిత, గిరిజన, బీసీలకు అండగా ఉంటామని రాజ్యాంగాన్ని కాపాడేది కాంగ్రెస్ పార్టేనని పేర్కొన్నారు. ఎటువైపు నిలబడాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు తేల్చుకోవాలని తెలిపారు. తనపై స్వయంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఫిర్యాదు చేసిందన్నారు. ముస్లిం రిజర్వేషన్లపై తప్పుదోవ పట్టించొద్దని తెలిపారు. కార్పొరేట్ సెక్టార్ల కోసమే రిజర్వేషన్ల రద్దు చేయడానికి బీజేపీ సిద్ధమైందని ఆరోపించారు. రిజర్వేషన్లపై చర్చ రాకుండా అడ్డుకునేందుకే తనపై కేసు పెట్టారని విమర్శించారు.

మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ తూర్పులో బీఆర్ఎస్ ఖాళీ..

- మంత్రి కొండా సురేఖ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : వరంగల్ తూర్పులో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతోందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. వరంగల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తూర్పులో బీఆర్ఎస్ ఖాళీ అయిందని లోకసభ ఎన్నకల్లో బీజేపీతోనే పోటీ అని పేర్కొన్నారు. బీజేపీ రాముడి పేరు చెప్పి ఓట్లు అడగడం సిగ్గు చేటన్నారు. ముస్లిం రిజర్వేషన్లు తొలగించడానికి బీజేపీ సిద్ధంగా ఉందని విమర్శించారు. మత రాజకీయాలు చేయడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఆగస్టు 15లోపు రూ.2 లక్షలు రైతు రుణమాఫీ కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగులకు ప్రతి నెలా రెండో తేదీన జీతాలు వేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ క్యాండెట్లు అంతా చరిష్మా లేనివారేనని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య బరిలో ఉందని, ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

కడియం కావ్య ముందే కార్యకర్తల గొడవ

వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ అంతర్గత గొడవల కారణంగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు చేదు అనుభవం ఎదురైంది. డివిజన్ల వారీగా కార్యకర్తల సమావేశానికి కడియం కావ్య హాజరు కాగా, ఆమె ముందే కొత్తగా పార్టీలో చేరిన వారు, పాత వారు గొడవకు దిగారు. పార్టీ ప్రముఖుల ముందే పార్టీ అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. కార్యకర్తల తీరుతో అసహనం చెందిన కడియం కావ్య అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం డివిజన్ల వారీగా సమావేశాలు మమ అనిపించారు.

బీఆర్ఎస్ కు మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి రాజీనామా

రాజీనామా లేకను కేసీఆర్ కు పంపిన మాజీ మంత్రి

అక్షర దర్బార్, హైదరాబాద్ : లోకసభ ఎన్నికల వేళ బీఆర్ఎస్ కు మరో షాక్ తగిలింది. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు కేసీఆర్ కు రాజీనామా పత్రాన్ని పంపించారు. గులాబీ పార్టీ నుంచి గెలిచిన వారు కొంత మంది ఇప్పటికే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా తాజాగా మాజీ మంత్రి చేరడం ఆ పార్టీకి తీరని లోటని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇంద్రకరణ్ రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర ఇన్చార్జీ దీపాదాస్ మున్షి సమక్షంలో ఆ పార్టీలో చేరడానికి రంగం సిద్ధమైంది.

క్లీనిక్ ను సీజ్..

అక్షర దర్బార్, వర్ధన్నపేట : వర్ధన్నపేట మండల కేంద్రంలో ఆర్ఎంపీ వైద్యం వికటించి పట్టణానికి చెందిన నవీన్ అనే వ్యక్తి మృతి చెందిన ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ విచారణ చేపట్టింది. మండల కేంద్రంలోని లక్ష్మీశ్రీ క్లినిక్ ను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సందర్శించి సీజ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో గోపాల్ రావు మాట్లాడుతూ.. ఆర్ఎంపీ, పీఎంపీలు ఇంజక్షన్లు వేయడానికి అనర్హులని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

జీఎంకు సన్మానం

అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు పదవీ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం సయ్యద్ హాబీబ్ హుస్సేన్ జీఎం ఓఎస్ డీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఏరియా జీఎం, ఓఎస్ డీ సయ్యద్ హబీబ్ హుస్సేన్ మాట్లాడుతూ ఇప్పటివరకు సంస్థకు బళ్లారి శ్రీనివాసరావు చేసిన కృషిని కొనియాడారు. అనంతరం బళ్లారి శ్రీనివాస రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు కవీంద్ర, వెంకటరామిరెడ్డి, ప్రసాద్, అజ్మీరా

శ్రీనివాసరావును సన్మానిస్తున్న అధికారులు

తుకారాం, రవికుమార్, డీజీఎం సివిల్ సురేఖ, డాక్టర్ ఎస్.పద్మజ నాయకులు పాల్గొన్నారు.

కోటి నగదు పట్టివేత

అక్షర దర్బార్, హైదరాబాద్ : ఎన్నికల వేళ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. బుధవారం ఒక్కరోజే సైబరాబాద్ ఎస్ వోటీ బృందం ఆరు ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించి రూ.1,06,62,730 నగదు పట్టుకున్నారు. మేడ్చల్ టీమ్ రూ.60,17,400, రాజేంద్రనగర్ టీమ్ రూ. 22,30,600, మేడ్చల్ రెండో టీమ్ రూ. 9,11,900, మాదాపూర్ టీమ్ రూ.7,38,237, మేడ్చల్ మూడో టీమ్ రూ. 5,01,993, బాలానగర్ టీమ్ రూ. 2,62,600 పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు.

పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన నగదు

మారపల్లి అక్షిత
9.8 జీపీఏ

ప్రత్యూష
9.0 జీపీఏ

సాయికుమార్
జీపీఏ 9.0

పది ఫలితాల్లో గొర్లవీడు విద్యార్థుల ప్రతిభ

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గొర్లవీడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేసిన ఆధ్యాపకులను హెచ్ఎం అనిత అభినందించారు. గోర్లవీడు హైస్కూల్ విద్యార్థులు 91.66శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన వారిలో ఎం.అక్షిత 9.8 జీపీఏ, ఎన్.ప్రత్యూష 9.0 జీ పీఏ, ఎం.సాయికుమార్ 9.0 జీపీఏ సాధించారు. మొ త్తం 36 మంది విద్యార్థులకు 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని హెచ్ఎం అనిత తెలిపారు.

కక్షతో జైలుకు పంపారు

మాజీ ఎమ్మెల్యే నరేందర్

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : కక్షతోనే కార్పొరేటర్ మరుపల్లి రవిని మంత్రి కొండా సురేఖ జైలుకు పంపించారని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. బుధవారం వరంగల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 మంది కార్పొరేటర్లను బెదిరించి కాంగ్రెస్ పార్టీలోకి తీసుకుపోయారని విమర్శించారు. కార్పొరేటర్ రవిపై ఎస్సీ, ఎస్టీ అక్రమ కేసు పెట్టి జైలుకు తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండా దంపతులకు భయపడేవారు ఎవరూ లేరని, కచ్చితంగా వారి అక్రమాలను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమ కేసులు కాంగ్రెస్ పార్టీ వారు పెడతారనే కేసీఆర్ బీఆర్ఎస్ లీగల్ సెల్ కు రూ. 10 కోట్లు కేటాయించారని చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఎవరికి అన్యాయం జరగకుండా చూసుకుంటామని మాజీ ఎమ్మెల్యే నరేందర్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో కుమారస్వామి, నీలం రాజ్ కిషోర్ పాల్గొన్నారు.